సాక్షి
పశ్చిమగోదావరి

గురువారం । 15 । ఫిబ్రవరి । 2024



మావుళ్లమ్మ సన్నిధిలో..

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం మావుళ్లమ్మ వారిని బుధవారం వైఎస్సార్‌సీపీ విశాఖ లోక్‌సభ స్థానం సమన్వయకర్త బొత్స ఝాన్సీ దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేయించారు.



శేష వాహనంపై శోభనాచలుడు

ఆగిరిపల్లి : శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహస్వామి రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పెద్ద శేష వాహనంపై దర్శనం ఇచ్చారు. సాయంత్రం గ్రామోత్సవం జరిగింది.



మద్దిలో శ్రీవారి కల్యాణం

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం మద్ది ఆంజనేయ క్షేత్రంలో బుధవారం శ్రీనివాసుని కల్యాణం నిర్వహించారు. మాఘశుద్ధ పంచమి సందర్భంగా వేడుక జరిపించారు.

న్యూస్‌రీల్

సంజీవయ్య సేవలు చిరస్మరణీయం



కలెక్టరేట్‌లో సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్) : దివంగత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య సేవలు చిరస్మరణీయమని జిల్లా ఇన్‌చార్జి రెవెన్యూ అధికారి బి.శివనారాయణరెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో సంజీవయ్య జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిజాయితీగా ప్రజలకు సేవలందించడంతో పాటు ప్రజాహిత పాలన కోసం ఆయన పలు సంస్కరణలు అమలుచేశారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేశారన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.డి మహేశ్వరరావు, జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వర రావు, ఆర్‌అండ్‌బీ అధికారి ఎస్.లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆచంట ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు ఉదారత



వృద్ధ దంపతులకు సాయం చేస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

పెనుమంట్ర : పెనుమంట్ర-2 సచివాలయ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో నివాసం ఉంటున్న బొడ్డు వెంకటేశులు, ముత్యాలమ్మ అనే వృద్ధ దంపతులకు బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు ఆర్థిక సాయం చేసి ఉదారత చాటారు. అలాగే ప్రతి నెలా ఈ దంపతులకు రూ.5 వేల చొప్పున అందిస్తానని ప్రకటించారు. వృద్ధ దంపతుల ఆధార్, రేషన్ కార్డుల్లో వయసు నమోదులో తప్పులు దొర్లడంతో పెన్షన్ మంజూరుకు ఇబ్బందిగా మారింది. రికార్డుల్లో వయసు తక్కువగా నమోదు కావడమే ఇందుకు కారణం. బుధవారం రోడ్డు ప్రారంభోత్సవానికి వచ్చిన శ్రీరంగనాథరాజుకు డ్వాక్రా మహిళ ఇందుకూరి రమావతి వృద్ధ దంపతుల విషయాన్ని తెలియజేయడంతో ఆయన స్పందించి ఆర్థిక సాయం అందించారు.

3న పల్స్ పోలియో



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మహేశ్వరరావు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లావ్యాప్తంగా వచ్చేనెల 3న పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎంహెచ్‌ఓ డి.మహేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జిల్లా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో, ప్రపంచ ఆరోగ్య సంస్థ సర్వే లైన్స్ అధికారి డా.మౌనిక స్టెఫీ అధ్యక్షతన నేషనల్ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా పల్స్ పోలియోపై జిల్లాస్థాయి వర్కుషాపు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ చిన్నారుల నిండు జీవితానికి రెండు పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పక వేయాలని, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆరోగ్య కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించాలన్నారు. మార్చి 3న పోలియో చుక్కలు వేయించుకోలేని పిల్లలు ఉంటే 4, 5వ తేదీల్లో ఇంటింటా సందర్శించి వేయాలన్నారు. జిల్లాలో 1,315 బూత్‌లు, 5,260 మంది అధికారులు, సిబ్బందిని నియమించామని, ఐదేళ్లలోపు పిల్లలు 1,85,000 మంది ఉన్నారన్నారు. జిల్లా ఇమ్యూనికేషన్ అధికారి డా.డి.సుధాలక్ష్మి, జిల్లా గణాంక అధికారి ఎంఎస్ ప్రసాద్, ప్రోగ్రాం ఆఫీసర్ డా.ధనలక్ష్మి, డా.భావన తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ఇంటర్ ప్రాక్టికల్స్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ఏలూరు జిల్లాలోని 56 కేంద్రాల్లో జనరల్ విద్యార్థులకు, 16 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు బుధవారం ప్రాక్టికల్స్ నిర్వహించారు. 5,309 మందికి గాను 5,199 మంది హాజరయ్యారు. ఉదయం 2,846 మందికి 2,764, మధ్యాహ్నం 2,463 మందికి 2,435 మంది హాజరయ్యారు ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని ఇంటర్మీడియెట్ పరీక్షల కన్వీనర్ బి.ప్రభాకర్ తెలిపారు.

విజయవంతంగా కులగణన

జిల్లాలో 93 శాతం పూర్తి

- 6.46 లక్షల కుటుంబాల్లో సర్వే లక్ష్యం
- 5.99 లక్షల కుటుంబాల్లో గణన పూర్తి
- అందుబాటులో లేని కుటుంబాలు 46,111
- 17 నాటికి సచివాలయాల్లో డేటా
- 24 నాటికి ప్రభుత్వానికి నివేదిక



కాళ్ల మండలం పెద అమిరంలో కులగణన సర్వే చేస్తున్న సిబ్బంది

జిల్లాలో కుటుంబాలు	సర్వే పూర్తయినవి	అందుబాటులో లేనివి
6,46,101	5,99,990	46,111
జిల్లాలో క్లస్టర్లు 9,633	ఎన్యూమరేటర్లు 7,051	సూపర్‌వైజర్లు 1,107

సాక్షి, భీమవరం: బడుగు, బలహీన వర్గాల వారి చిరకాల వాంఛను నెరవేరుస్తూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన చరిత్రాత్మక కులగణన విజయవంతంగా సాగింది. జిల్లాలోని 535 సచివాలయాల పరిధిలో 6,46,101 కుటుంబాలను సర్వే చేయాలన్నది లక్ష్యం కాగా 93 శాతం కుటుంబాలను సిబ్బంది సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈనెల 17న గ్రామ, వార్డు సచివాలయాల్లో డేటాను అందుబాటులో ఉంచి 24న ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నారు. రాజ్యాంగ, ప్రభుత్వ పథకాల ఫలాలు పూర్తిస్థాయిలో అట్టడుగు వర్గాల వారికి అందించేందుకు కులగణన చేయాలన్న డిమాండ్ వివిధ కుల సంఘాల నుంచి దీర్ఘకాలంగా ఉన్నా వారి అభ్యర్థనను గత ప్రభుత్వాలు పెడచెవిన పెట్టాయి. సామాజిక సాధికారతకు పెద్దపీట వేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వారి చిరకాల కోరికను నెరవేరుస్తూ నిర్ణయం తీసుకున్నారు. 726 కులాలకు సంబంధించి దేశంలో కుల గణన చేస్తున్న ఏకైక రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు గుర్తింపు తెచ్చారు. వందేళ్ల తర్వాత రాష్ట్రంలో చరిత్రాత్మక కులగణన కార్యక్రమం గత నెల 9న మొదలైంది.

పక్కాగా.. పారదర్శకంగా..

జిల్లాలోని 531 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో 6,46,101 కుటుంబాలు ఉండగా 18,04,501 సభ్యులు ఉన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, విధాన నిర్ణయాల రూపకల్పనకు వీలుగా వీరిలో ఆయా సామాజిక వర్గాలకు సంబంధించి ఏఏ ఉప కులాల జనాభా ఎంత మంది ఉన్నారు? వారి స్థితిగతులు తెలుసుకోవాలన్నది లక్ష్యం. జిల్లా మొత్తాన్ని 9,633 క్లస్టర్లుగా విభజించి రెవెన్యూ, పంచాయతీ, మున్సిపల్, ప్లానింగ్ తదితర శాఖల నుంచి 7,051 ఎన్యుమేటర్లు, 1,107 మంది సూపర్‌వైజర్లు డోర్ డోర్ సర్వే నిర్వహించారు. 5,99,990 కుటుంబాలకు సంబంధించి 16,24,551 మంది సభ్యుల నుంచి స్వచ్ఛందంగా వివరాలు సేకరించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు ఎవరైనా కులం పేరు చెప్పడానికి ఇష్టపడకపోతే ఒత్తిడి చేయకుండా చెప్పిన వివరాలనే నమోదు చేశారు. 93 శాతం సర్వే పూర్తి కాగా అందుబాటులో లేని, పేర్లు చెప్పేందుకు ఇష్టం లేని కుటుంబాలు 46,111 వరకు ఉన్నాయి. 17న గ్రామ, వార్డు సచివాలయాల్లో డేటాను అందుబాటులో ఉంచి, 24న ప్రభుత్వానికి నివేదించనున్నట్టు అధికారులు తెలిపారు. సేకరించిన సమాచారం ప్రభుత్వం వద్ద భద్రంగా ఉంటుందని, దీనిని ఏ ప్రైవేటు సంస్థకు, వ్యక్తులకు మళ్లించమని వివరించారు.

కులగణన సర్వే వివరాలు

మండలం	సర్వే చేయాల్సిన కుటుంబాలు	కుటుంబ సభ్యులు	సర్వే పూర్తయిన కుటుంబాలు	కుటుంబ సభ్యులు
భీమవరం అర్బన్	45,591	1,30,208	40,012	1,12,233
నరసాపురం	19,007	53,960	17,352	47,047
పాలకొల్లు	21,337	60,694	19,722	54,891
తాడేపల్లిగూడెం అర్బన్	34,698	96,561	31,680	86,222
తణుకు అర్బన్	30,413	85,218	27,579	75,878
తాడేపల్లిగూడెం	32,226	88,607	30,806	82,660
పెంటపాడు	25,804	69,511	24,212	64,037
తణుకు	21,566	59,061	20,345	54,263
అత్తిలి	24,511	66,821	23,164	61,502
గణపవరం	23,084	62,084	21,768	57,256
ఆకివీడు	25,356	71,582	23,210	62,019
ఉండి	23,805	64,356	22,423	59,193
పాలకోడేరు	24,991	66,588	22,640	58,810
పెనుమంట్ర	21,302	58,832	20,086	53,653
ఇరగవరం	23,706	65,319	22,665	60,634
పెనుగొండ	24,467	69,417	21,932	58,558
ఆచంట	20,471	57,854	18,845	49,933
పోడూరు	22,486	64,132	21,475	58,890
వీరవాసరం	22,494	63,678	21,154	57,547
భీమవరం	30,552	85,540	27,925	74,153
కాళ్ల	24,556	68,891	23,112	63,802
మొగల్తూరు	26,528	75,625	24,890	67,727
నరసాపురం అర్బన్	27,624	80,063	26,049	73,503
పాలకొల్లు అర్బన్	24,596	68,992	23,135	64,024
యలమంచిలి	24,930	70,907	23,809	66,116

రైతు పక్షపాతి సీఎం జగన్

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



రైతులకు మోటార్లను పంపిణీ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: రైతులకు ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని హామీలను అమలు చేసి రైతు పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం వైఎస్సార్ జలకళ పథకంలో భాగంగా రైతులకు మోటార్లను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు మాట్లాడుతూ 285 దరఖాస్తులు రాగా 192 మంజూరయ్యాయన్నారు. వాటిలో 117 బోర్‌వెల్స్, 109 ట్రాన్స్‌ఫార్మర్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఇప్పటికే 91 ట్రాన్స్‌ఫార్మర్లను లబ్ధిదారులకు పొలాల్లో ఏర్పాటు చేశామన్నారు. బోర్‌వెల్స్‌కు సంబంధించి 66 మోటార్లకు మొదటి విడతలో 32 మోటార్లను అందజేశామన్నారు. ప్రస్తుతం మోటార్లతోపాటు పైపులు, స్టార్టర్లు తదితర సామగ్రిని ప్రభుత్వం అందిస్తోందన్నారు. రైతుల అభ్యున్నతికి వైఎస్సార్ జలకళ పథకాన్ని ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మాటను నిలబెట్టుకుని అమలు చేసిన జగన్‌ను రాబోయే ఎన్నికల్లో గెలుపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు నేడు తాము అధికారంలోకి వస్తే రైతులకు న్యాయం చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సీఎం జగన్ రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్నివిధాలా అండగా ఉంటున్నారన్నారు. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమతుల్యంగా ఉందని చెప్పడంతో ఎల్లోమీడియా పత్రికలు, చానళ్లు అయోమయంలో ఉన్నాయన్నారు. అనంతరం రైతులకు మోటార్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.సుబ్రహ్మణ్య శాస్త్రి, మున్సిపల్ కమిషనర్ డాక్టర్ అనపర్తి శామ్యూల్, ఎస్ఆర్ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్ థామస్, ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్, వైఎస్ చైర్మన్ సత్యనారాయణ, జడ్డు హరిబాబు పాల్గొన్నారు.

'పశ్చిమ' కలెక్టర్‌గా సుమిత్‌కుమార్

కలెక్టర్ ప్రశాంతి అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్‌గా బదిలీ



సుమిత్‌కుమార్ గాంధీ

సాక్షి, భీమవరం/భీమవరం (ప్రకాశంచౌక్) : పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్‌గా సుమిత్‌కుమార్ గాంధీ నియమితులయ్యారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా భీమవరం వస్తున్నారు. ఇప్పటివరకు ఇక్కడ కలెక్టర్‌గా సేవలందించిన పి.ప్రశాంతి అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్‌గా బదిలీ అయ్యారు. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ కేఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలిచ్చారు.

గతంలో నరసాపురం సబ్ కలెక్టర్‌గా..

కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ ఈ ప్రాంత ప్రజలకు సుపరిచితులే. 29 ఏళ్ల వయసులోనే ఆయన నరసాపురం నుంచి సబ్ కలెక్టర్‌గా తొలి ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. హర్యానాలోని రోహతక్ జిల్లాలో మారుమూల గ్రామం కోనూర్ ఆయన స్వస్థలం. మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఆయన 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలోనే చదివారు. ఇంజినీరింగ్ పూర్తయ్యాక గురుగావ్‌లో నాలుగేళ్లపాటు ఐటీ ప్రొఫెషనల్‌గా పనిచేశారు. ఐటీ ఉద్యోగం చేస్తూనే సివిల్స్‌కు సిద్ధమై 2014లో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. అనంతపురంలో ట్రైనీ కలెక్టర్‌గా పనిచేసిన అనంతరం నరసాపురం రెవెన్యూ సబ్ డివిజన్ కలెక్టర్‌గా ఆయనకు ప్రభుత్వం తొలి పోస్టింగ్ ఇచ్చింది. డివిజన్‌లోని నరసాపురం, పాలకొల్లు, ఆచంట, భీమవరం, ఉండి నియోజకవర్గాల్లో ఆయన సబ్ కలెక్టర్‌గా సేవలందించారు. రాజకీయ ఒత్తిళ్లు, అవినీతి వ్యవహారాలు దరికిరానివ్వని అధికారిగా ఆయన గుర్తింపు పొందారు. పాలనాపరంగా పలు సంస్కరణలు తీసుకువచ్చి ప్రజల నుంచి మన్ననలు పొందారు. డివిజన్‌లో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఎవరు ముడుపులు అడిగినా నేరుగా తనకు ఫిర్యాదు చేయాలని కార్యాలయంలో కంప్లయింట్ బాక్సు కూడా ఏర్పాటుచేయడం ద్వారా రెవెన్యూ విభాగంలో అక్రమాలకు అప్పట్లోనే ఆయన చెక్ పెట్టారు. అనంతరం శ్రీకాకుళం, తూర్పుగోదావరి జిల్లాల జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తూ జిల్లాల పునర్విభజనలో భాగంగా నూతనంగా ఏర్పడిన అల్లూరి సీతారామరాజు జిల్లాకు తొలి కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. తాజాగా పశ్చిమగోదావరి జిల్లాకు రెండో కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. రెండు, మూడు రోజుల్లో ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టనున్నట్టు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.

16న ఖోఖో సెలెక్షన్స్

దెందులూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా సీనియర్ పురుషుల ఖోఖో జట్టును ఈనెల 16న లింగపాలెం మండలం గోకవరం హైస్కూల్‌లో ఉదయం ఎంపిక చేస్తామని పశ్చిమగోదావరి జిల్లా ఖోఖో అధ్యక్ష కార్యదర్శులు ఈ.సాంబశివరావు, రంగారావు తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ సామర్లకోటలో జరిగే 56వ సీనియర్ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు జట్టును ఎంపిక చేస్తామన్నారు.

రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి



రేలంగిలో సాయిబాబా గుడి వద్ద శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ఇరగవరం : వైఎస్సార్‌సీపీ పాలన, సీఎం జగన్ వచ్చిన తర్వాతే రాష్ట్రంలో ఆలయాల అభివృద్ధి జరుగుతుందని పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని రేలంగిలో సాయిబాబా గుడి వద్ద రూ.12.50 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలును ప్రారంభించి, లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునః నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా రాష్ట్రంలో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. శిథిలావస్థకు చేరిన ఆలయాలను సీఎం జగన్ పునః నిర్మించి చిత్తశుద్ధిని చాటుతున్నారన్నారు. పరమత సహనంతో ముందుకు వెళుతున్నారని, అర్చకులు జీతాలు ఇవ్వడం, వంశపారంపర్య హక్కును కల్పించడం వంటివి చేశారన్నారు. ఆదాయం లేని ఆలయాలను సైతం అభివృద్ధి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించాలని పిలుపునిచ్చారు. నరసాపురం ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల, సర్పంచ్ చేబ్రోలు స్వరాజ్యం, ఉప సర్పంచ్ పులుపు అక్కమాంబ, పార్టీ గ్రామ అధ్యక్షుడు పులుపు అనిల్, ఎంపీటీసీలు మెట్ల కిరణ్మయి, సొసైటీ అధ్యక్షుడు రాంబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు గాదిరాజు బుజ్జి, వడ్డి మార్కండేయులు, యూత్ ఉపాధ్యక్షుడు వీరమల్లు ఫణీంద్ర, మైనం పాము తదితరులు పాల్గొన్నారు.

మహిళా స్వావలంబనకు ఆసరా

రాష్ట్రంలో మహిళల ఆర్థిక స్వావలంబన లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పథకాలు అమలుచేస్తున్నారు. ప్రతి పథకంలోనూ వారిని భాగస్వామ్యం చేస్తూ మహిళా సాధికారతకు కృషి చేస్తున్నారు. డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీని వైఎస్సార్ ఆసరా సాయంగా అందిస్తున్నారు. జిల్లాలో నాలుగో విడత ఆసరా సంబరాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం భీమవరం నియోజకవర్గంలో ఆసరా కార్యక్రమం నిర్వహించారు.

– భీమవరం(ప్రకాశం చౌక్)

ఇచ్చిన మాటకు కట్టుబడి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళలకు ఇచ్చిన హామీలను పూర్తిగా అమలుచేస్తున్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి డ్వాక్రా రుణమాఫీ చేశారు.

– గ్రంధి శ్రీనివాస్, ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే

(భీమవరంలో బుధవారం జరిగిన ఆసరా కార్యక్రమంలో..)



భీమవరంలో మహిళలకు ఆసరా చెక్కు అందిస్తున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి ఉమాబాల

మా గ్రూపునకు రూ.9.60 లక్షలు



మా గ్రూపునకు రూ.9.60 లక్షల రుణమాఫీ జరిగింది. సభ్యులకు ఏడాదికి రూ.24 వేల చొప్పున లబ్ధి చేకూరింది. నాకు ఆసరా, అమ్మఒడి, మా అమ్మకు కాపునేస్తం, సంక్షేమ పథకాల లబ్ధి చేకూరింది. జగనన్న మహిళా పక్షపాతిగా నిలిచారు.

– సాధనాల పద్మావతి, భీమవరం

చాలా సంతోషంగా ఉంది



సీఎం జగన్ డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ చేయడం చాలా సంతోషం. మా గ్రూపులో సభ్యులకు ఏడాదికి రూ.24,700 చొప్పున రుణమాఫీ అయ్యింది. నేను ఎమ్మెస్సీ, బీఈడీ చేశాను. డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చిన జగనన్నకు కృతజ్ఞతలు.

– వి.లీలాదేవి, భీమవరం

నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా శ్రీనివాసమూర్తి



నిట్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి డైరెక్టర్ బూదరాజు శ్రీనివాసమూర్తి

తాడేపల్లిగూడెం: ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ప్రొఫెసర్ బూదరాజు శ్రీనివాసమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఏపీ నిట్‌ను దేశంలో అగ్రగామిగా నిలపడానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. నిట్‌లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానన్నారు. ప్రాంగణంలోని భవన సముదాయాలను పరిశీలించారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ప్రమోద్ వి.పడోలే పనిచేశారు. శ్రీనివాసమూర్తికి ఇన్‌చార్జి రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి, డీన్‌లు జీఆర్‌కే శాస్త్రి, టి.కురుమయ్య, ఎస్.జయరామ్ తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

క్లుప్తంగా

చైతన్యంతోనే రోడ్డు ప్రమాదాల నివారణ



మాట్లాడుతున్న డీఆర్వో బి.శివనారాయణరెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): వాహన చోదకులను చైతన్యవంతులు చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులు సంయుక్తంగా కృషి చేయాలని ఇన్‌చార్జి డీఆర్వో బి.శివనారాయణ రెడ్డి అన్నారు. బుధవారం కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన జిల్లా రహదారుల భద్రతా కమిటీ సమావేశానికి డీఆర్వో అధ్యక్షత వహించి మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కఠినంగా వ్యవహరించాలని పోలీసు, రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదం జరిగిన అరగంటలో డేటా అప్లోడ్ చేసి ఆ వివరాలను హాస్పిటల్ వర్గాలకు అందజేయాలన్నారు. పంచనామా, గాయాలు అయిన వివరాలు ఆన్లైన్లో అప్లోడ్ అయితేనే సర్టిఫికెట్లు జారీ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రదేశాలలో హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చెయ్యాలన్నారు. అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్లు, లైట్లు వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. మావుళ్ళమ్మ దేవస్థానం వద్ద వాహనలకు పార్కింగ్ రుసుము వసూలు చేసేలా మునిసిపల్ కౌన్సిల్‌లో తీర్మానం చెయ్యాలని మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. భీమవరంలో ఆవులు, పందులు రోడ్లపై తిరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వర రావు, డీఎంఅండ్‌హెచ్‌ఓ డి.మహేశ్వరరావు, జిల్లా ఆర్అండ్‌బీ శాఖ అధికారి ఎస్.లోకేశ్వర రావు, ట్రాఫిక్ సీఐ దాసు, మున్సిపల్ ఇంజినీర్ పి.త్రినాథరావు పాల్గొన్నారు.

'ఇన్‌స్పైర్ మనక్'తో ప్రతిభ వెలుగులోకి

- కేంద్ర స్థాయి పరిశీలకులు అమిత్‌జైన్
- కొవ్వలిలో ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శన
- రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు 12 ప్రాజెక్టుల ఎంపిక


కొవ్వలిలో ఓ విద్యార్థి ప్రాజెక్టును పరిశీలిస్తున్న కేంద్ర పరిశీలకులు అమిత్‌జైన్


రాష్ట్ర స్థాయికి ఎంపికైన వివిధ ప్రాజెక్టుల విద్యార్థులు

దెందులూరు: విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని ఇన్‌స్పైర్ మనక్ కేంద్ర స్థాయి పరిశీలకులు అమిత్‌జైన్ అన్నారు. కొవ్వలి ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన ఇన్‌స్పైర్ మనక్ జిల్లా స్థాయి విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా నుంచి 108 ప్రాజెక్టులను ప్రదర్శించారు. డీఈఓ అబ్రహం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రదర్శనలో మొత్తం 12 ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక కాగా, వాటిలో పశ్చిమగోదావరి జిల్లా నుంచి 5, ఏలూరు జిల్లా నుంచి 7 ప్రాజెక్టులు ఉన్నాయి. మొత్తం 89 పాఠశాలల విద్యార్థులు ఈ ప్రదర్శనలో పాల్గొనగా ఎంఈఓ స్థాయి అధికారులు జడ్జీలుగా వ్యవహరించి రాష్ట్ర స్థాయికి పంపే ప్రాజెక్టులను ఎంపిక చేశారు. ఒక్కొక్క ప్రాజెక్టుకు ఒక్కొక్క విద్యార్థి, ఒక గైడ్ టీచర్ వ్యవహరించారు. ఒక్కొక్క ప్రాజెక్టుకు ప్రభుత్వం గతంలోనే రూ.10 వేలు అందించింది. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు వినూత్నంగా ఆలోచించి కొత్త ఆవిష్కరణలకు నాంది పలికి భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రాజెక్టులను దెందులూరు ఎంఈఓ కే.అన్నమ్మ, పెదవేగి ఎంఈఓ అరుణ్‌కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి అబ్రహం, కేంద్ర పరిశీలకులు పరిశీలించారు. హైస్కూల్ హెచ్‌ఎం వీఎస్ఎన్ఎల్‌వీ శర్మ, గైడ్ టీచర్లు డీసీఈబీ సెక్రటరీ సర్వేశ్వరరావు, సైన్స్ అధికారి సీహెచ్ఆర్ఎం చౌదరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన ప్రాజెక్టులకు సంబంధించిన విద్యార్థుల వివరాలను అధికారులు వెల్లడించారు.

పశ్చిమగోదావరి జిల్లా నుంచి..
గులిపల్లి సంగీత (నర్సాపురం), బూర్ల మణికంఠ సాయి (తాడేపల్లిగూడెం), చెల్లుబోయిన లీలాసత్య సాయిశ్రీనాథ్ (నర్సాపురం), రాచమల్లు మధుమతిశ్రీ (నర్సాపురం), రాపాక జయశ్రీ (దువ్వ).

ఏలూరు జిల్లా నుంచి..
వేమూరి కావ్యశ్రీ (మండవల్లి), చెన్నేరు ఎస్తేరు రాణి (మొండూరు), సోబిల గౌతమ్‌సాయి (కలిదిండి), వాసే ఉజ్వల లక్ష్మి (కైకలూరు), పీ.యశస్వినీలమణికంఠ (పరింపూడి), వేల్పుల భార్గవి (చింతలపూడి), కత్తుల అన్వేష్ (అరిగెలపాడు).

కాంగ్రెస్ పార్టీలో సీనియర్లకు గౌరవం లేదు


పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు

ద్వారకాతిరుమల: కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకులకు గౌరవం లేదని, అందుకే తన పదవికి రాజీనామా చేశానని పార్టీ మండల అధ్యక్షుడు పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు బుధవారం విలేకరులకు చెప్పారు. రాజీనామా పత్రాన్ని వారం క్రితమే పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావుకు, తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు అరిగెల అరుణకుమారికి వ్యాట్సాప్ ద్వారా పంపానని, ఇప్పటివరకు వారు స్పందించకపోవడం మనస్తాపానికి గురిచేసిందన్నారు. పార్టీలో ముందు నుంచి ఉన్న వారికంటే వెనుక వచ్చిన వారికే ప్రాధాన్యత ఇస్తున్నారని, పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను, పార్టీ వ్యవహారాల పర్యవేక్షకులు మాణిక్ ఠాగూర్‌ను కలవనివ్వకపోవడం దారుణమన్నారు. పదిహేనేళ్లుగా కనబడని వారు ఇప్పుడొచ్చి సీనియర్ నాయకులను అవమానించడం బాధాకరమన్నారు. ఇక తాను కాంగ్రెస్ పార్టీలో ఇమడలేనని తేల్చిచెప్పారు. త్యాగ భీమేశ్వరరావు 2001 నుంచి కాంగ్రెస్‌లో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు.

టీడీఎస్ మినహాయింపుపై అవగాహన


సమావేశంలో పాల్గొన్న అధికారులు

తణుకు: ఏలూరు ఆదాయపు పన్ను శాఖ టీడీఎస్ విభాగం ఆధ్వర్యంలో తణుకు ఆంధ్రా సుగర్స్ సమావేశ మందిరంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదాయపు పన్ను శాఖ అధికారి నందూరి శ్రీనివాసరావు, విశాఖపట్నం ఐటీ ఇన్‌స్పెక్టర్ డి.శ్రావణి ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల డ్రాయింగ్ – డిస్బర్సింగ్ అధికారులకు టీడీఎస్ మినహాయింపుపై అవగాహన కల్పించారు. వేతనాల చెల్లింపులలో డ్రాయింగ్ అధికారులు ఆదాయపు పన్ను నిర్దేశించిన రేట్ల ప్రకారం టీడీఎస్ మినహాయించి ఆ మొత్తాన్ని సకాలంలో ప్రభుత్వానికి జమ చేయడంపై, త్రైమాసిక టీడీఎస్ స్టేట్‌మెంట్‌లను సకాలంలో దాఖలు చేయుడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సభ్యులకు అవగాహన కల్పించారు. పాన్, టాన్ నంబర్లను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరమే టీడీఎస్ చెల్లింపుల ప్రక్రియ చేపట్టాలని శ్రీనివాసరావు సూచించారు. ఆంధ్రా సుగర్స్ వైస్ ప్రెసిడెంట్ ఫైనాన్స్ పీవీఎస్ విశ్వనాథ్‌కుమార్, విశాఖపట్నం ఐటీ ఇన్‌స్పెక్టర్ డి.శ్రావణి, తణుకు పరిధిలోని ఎంఈఓలు, రెవెన్యూ అధికారులు, హైస్కూల్ హెచ్‌ఎంలు, సబ్ రిజిస్ట్రారు కార్యాలయ సిబ్బంది, చార్టర్డ్ ఎక్కౌంటెంట్లు, ఆంధ్రా సుగర్స్ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైల్వే ఏజీఎం విస్తృత తనిఖీలు


రైల్వే ఏజీఎం ధనుంజయులుకు సమస్యను వివరిస్తున్న దృశ్యం

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): విజయవాడ డివిజన్‌లోని నర్సాపూర్–భీమవరం టౌన్–గుడివాడ–మచిలీపట్నం బ్రాంచ్ లైన్ సెక్షన్లలో దక్షిణ మధ్య రైల్వే ఏజీఎం ధనుంజయులు బుధవారం విస్తృతంగా తనిఖీలు చేశారు. ముందుగా విజయవాడ డివిజన్ ఏడీఆర్ఎం ఎం.శ్రీకాంత్, పలు బ్రాంచ్ అధికారులతో కలసి నర్సాపూర్ స్టేషన్‌లో రన్నింగ్ రూమ్, ఐఓహెచ్ షెడ్, పిట్ లైన్, సీఅండ్‌డబ్ల్యూ డిపోలను పరిశీలించారు. అనంతరం ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా సిబ్బందితో కలిసి మొక్క నాటారు. ఇటీవల అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌లో జరుగుతున్న స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. అక్కడి నుంచి ఎస్‌పీఐసీ (సెల్ఫ్ ప్రొపెల్డ్ ఇన్‌స్పెక్షన్ కార్)లో పాలకొల్లు స్టేషన్ చేరుకున్నారు. అక్కడ ప్లాట్‌ఫామ్‌లు, ప్రయాణికుల సౌకర్యాలను పరిశీలించి, భద్రత అంశాలు, నిర్వహణ పనులపై అధికారులతో సమీక్షించారు. డీఆర్‌యూసీసీ సభ్యులు, ట్రేడ్ యూనియన్ నాయకులతో మాట్లాడి వారి వినతులను స్వీకరించారు. అక్కడ నుంచి భీమవరం టౌన్ చేరుకుని హెల్త్ యూనిట్, బుకింగ్ కార్యాలయం, గూడ్స్ షెడ్, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను తనిఖీ చేసి అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించారు. ఆ తర్వాత ఆకివీడు, గుడివాడ, మచిలీపట్నం స్టేషన్‌లకు చేరుకుని ప్రయాణికుల సౌకర్యాలు, పార్శిల్ కార్యాలయం, ఎఫ్ఓబీలు, పరిశుభ్రతలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ పర్యటనలో ఏజీఎంతో పాటు సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు, సీనియర్ డీఓఎం డి.నరేంద్ర వర్మ, సీనియర్ డీఈఈలు కె.శ్రీనివాసరావు, టి.సురేష్, డీఈఎన్ కె.శ్రీధర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైజాగ్ ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరించాలని వినతి
పాలకొల్లు అర్బన్: కరోనా సమయంలో నిలిపివేసిన నరసాపురం–వైజాగ్ ఎక్స్‌ప్రెస్ రైలును తక్షణం పునరుద్ధరించాలని కోరుతూ డీఆర్‌యూసీసీ మెంబర్ జక్కంపూడి కుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్, సీనియర్ సిటిజన్స్ ఫోరం సభ్యులు దక్షిణ మధ్య రైల్వే అడిషనల్ జీఎం ఆర్.ధనుంజయులుకు వినతిపత్రం అందజేశారు. బుధవారం పాలకొల్లు రైల్వేస్టేషన్‌ను తనిఖీ చేసిన సందర్భంగా రైల్వే ఏజీఎంను వారు కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. నరసాపురం నుంచి వారణాసికి వందే భారత్ రైలును నడపాలని కోరారు. దీనిపై ఏజీఎం మాట్లాడుతూ వినతిని పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. లిఫ్ట్ పనులు త్వరలో పూర్తి చేసి రైల్వే ప్రయాణికులకు వినియోగంలోకి తీసుకువస్తామన్నారు. పాలకొల్లు , శృంగవక్షం రైల్వే గేట్ల వద్ద పాడైన రోడ్లకు మరమ్మతులు చేయిస్తామన్నారు. బీజేపీ నాయకులు కొల్లి కొండ ప్రసాద్, కొణిజేటి గుప్త తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ యూనిట్లను ప్రోత్సహించాలి


బ్యాంకర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్

ఏలూరు (మెట్రో): జిల్లాలో అర్బన్, గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) యూనిట్లు నెలకొల్పేందుకు బ్యాంకర్లు అత్యంత ప్రాధాన్యతనివ్వాలని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో లీడ్ బ్యాంకు ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సమీక్షా కమిటీ (డీసీసీ) నాల్గవ త్రైమాసిక బ్యాంకర్ల సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ఎంఎస్ఎంఈ కింద పాత యూనిట్ల విస్తరణకు రుణమంజూరు చేయడమే కాకుండా కొత్త యూనిట్లు ఏర్పాటుకు ప్రోత్సాహం అందించాలన్నారు. ఎంఎస్ఎంఈ కింద ఆయా బ్యాంకుల వారీగా యూనిట్ల మంజూరు, గ్రౌండింగ్, ఉపాధి వివరాలు ఇవ్వాలని కోరినా స్పందించకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లాలోని ప్రధాన బ్యాంకు శాఖలన్నీ పీఎంఈజీపీ కింద కనీసం మూడు డైరీ యూనిట్లను ఏర్పాటుకు ముందుకు రావాలన్నారు. వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం కింద సర్వీసు, తయారీ రంగాల్లో ఉపాధి యూనిట్లు నెలకొల్పేందుకు ఎస్సీ, ఎస్టీలకు 45 శాతం సబ్సిడీతో అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకునేలా చొరవ చూపాలన్నారు. ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా పథకం కింద అందిన దరఖాస్తుల్లో అత్యధికంగా తిరస్కరణపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పీఎంఈజీపీ కింద ఉపాధి కల్పించేందుకు ఎంతో ప్రాధాన్యతనిస్తున్నప్పటికి అందుకు సంబంధించి వివిధ బ్యాంకులకు 580 దరఖాస్తులు రాగా వాటిలో 223 తిరస్కరణకు గురికాగా వాటిలో కేవలం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు 117 దరఖాస్తులను తిరస్కరించడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. మరో 79 దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టడంపై కారణాలను వచ్చే సమావేశం నాటికి సమర్పించాలని బ్యాంకు అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. ఆర్‌బీఐకి చెందిన ఎల్‌డీఓ పూర్ణిమ, నాబార్డ్ డీడీఎం అనీల్‌కాంత్, ఎల్‌డీఎం డి.నీలాద్రి పాల్గొన్నారు.

స్థాయి 'కొలుసు'కుంటే కుదరదు

- ముద్దరబోయినకు టికెట్ ఇవ్వాల్సిందే..!
- నూజివీడు టీడీపీలో భగ్గుమన్న వర్గవిభేదాలు
- పార్థసారథి ఫ్లెక్సీలను చించేసిన ముద్దరబోయిన వర్గం
- వాడుకుని వదిలేస్తారా అంటూ చంద్రబాబుపై ఫైర్


నూజివీడులో పార్థసారథి ఫ్లెక్సీలను చించిపడేసిన ముద్దరబోయిన వెంకటేశ్వరరావు వర్గం కార్యకర్తలు

నూజివీడు: నూజివీడు టీడీపీలో రోజురోజుకు వర్గ విభేదాలు భగ్గుమంటున్నాయి. టీడీపీకి నూజివీడు అభ్యర్థిగా పెనమలూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొలుసు పార్థసారథిని నిలబెట్టాలని చంద్రబాబు చేస్తున్న ప్రయత్నాలపై తెలుగు తమ్ముళ్లు తీవ్రంగా మండిపడుతున్నారు. పదేళ్లపాటు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ముద్దరబోయిన వెంకటేశ్వరరావును వాడుకుని తీరా ఎన్నికలు దగ్గరవుతున్న వేళ టికెట్ ఇవ్వకుండా బలిపశువును చేస్తారా అంటూ ఫైర్ అవుతున్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గం టీడీపీలో వర్గ పోరాటం మరింత వేడెక్కింది. నూజివీడు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పార్థసారథి బ్యానర్లపై ఉన్న ముద్దరబోయిన ఫొటోలను ఆయన అనుచరులు మంగళవారం పూర్తిగా చించివేసి తొలగించారు.

రివర్స్ రాజకీయాలతో అసహనం
పట్టణంలోని రాజీవ్ సర్కిల్, సెయింట్‌ఆన్స్ స్కూల్, రావిచర్ల రోడ్డు వద్ద, దత్తాశ్రమం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బ్యానర్లను బుధవారం ఉదయానికి మొత్తం చించేశారు. దీంతో టీడీపీలో వర్గ విభేదాలు ముదిరిపోయాయి. టీడీపీ అభ్యర్థిగా ముద్దరబోయిననే ప్రకటించాలని ఆయన వర్గం నాయకులు, కార్యకర్తలు అధిష్టానాన్ని డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరిస్తున్నారు. నూజివీడులో కార్యాలయాన్ని ఏర్పాటు చేసి పదేళ్లుగా టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి, పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమాన్ని నిర్వహించిన ముద్దరబోయినకు టికెట్‌ను ప్రకటించకుండా వలస పక్షిని నూజివీడుకు తీసుకొచ్చేందుకు చంద్రబాబు వ్యవహరిస్తున్న తీరుపై టీడీపీ వర్గాల్లోనే అసహనం వ్యక్తమవుతోంది. గతేడాది నూజివీడులో సభ నిర్వహించిన సమయంలో కూడా ముద్దరబోయినే ఎమ్మెల్యే అభ్యర్థి అని, మరో ఆలోచన లేదని చెప్పిన చంద్రబాబు ఇప్పుడు రివర్స్ రాజకీయాలు చేయడంపై వారంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

ఆది నుంచి ముద్దరబోయినకు ఎదురీతే..
2014లో నూజివీడు నుంచి టీడీపీ తరఫున పోటీ చేసి ఓటమి చెందిన నాటి నుంచి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఎదురీత ఈదుతున్నారు. తాను ఓడినప్పటికి పార్టీ అధికారంలోకి వచ్చిందన్న సంతోషం కూడా లేకుండా చేశారు. అప్పటి ఏలూరు ఎంపీ మాగంటి బాబు నూజివీడు నియోజకవర్గంలో తన సామాజిక వర్గం నాయకులతో కలిసి ముద్దరబోయినకు వ్యతిరేక వర్గాన్ని తయారు చేసి అడ్డుకునేవారు. అంతేకాకుండా ముద్దరబోయిన వ్యతిరేకిస్తున్నా ఆయనకు వ్యతిరేక వర్గానికి చెందిన నాయకుడిని ఏఎంసీ చైర్మన్‌గా చేశారు. ముద్దరబోయిన వర్గం నుంచి వచ్చిన వారికి ఏ పని చేయవద్దని అధికార యంత్రాంగానికి కూడా ఆదేశాలు జారీ చేశారు.

ఉరి వేసుకుని వీఆర్ఏ ఆత్మహత్య

ఏలూరు టౌన్: ఆర్థిక ఇబ్బందులతో ఉరి వేసుకుని వీఆర్ఏ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. ఏలూరు గడియారస్తంభం సమీపంలోని జామా మసీదు ప్రాంతంలో నివాసం ఉంటున్న నాయుడు దుర్గాప్రసాద్ (38) గుండుగొలను వీఆర్ఏగా పనిచేస్తూ ప్రస్తుతం డిప్యూటేషన్‌పై భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఏడాది క్రితం లలిత అనే యువతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. ఆమె అప్పటికే తన మొదటి భర్తకు విడాకులు ఇచ్చి ఇద్దరు సంతానంతో ఉంది. అయితే దుర్గాప్రసాద్‌కు అప్పులు ఉన్నట్లు తనతో అనేకసార్లు చెప్పేవాడని భార్య తెలిపింది. బుధవారం ఉదయం కార్యాలయానికి వెళ్లేందుకు సిద్ధమై గదిలోకి వెళ్లి ఉరి వేసుకున్నాడు. స్థానికుల సహకారంతో తలుపులు పగులగొట్టి అతనిని కిందకు దించి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే దుర్గాప్రసాద్ మృతి చెందాడు. ఏలూరు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ కింద పడి డ్రైవర్ మృతి

ఏలూరు టౌన్: ట్రాక్టర్ నడుపుతున్న డ్రైవర్ ప్రమాదవశాత్తు అదే ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఏలూరు రూరల్ చాటపర్రు గ్రామానికి చెందిన మద్రాపు దుర్గాప్రసాద్ (41)కి భార్య రమాదేవి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. దుర్గాప్రసాద్ గత కొంతకాలంగా ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం ఉదయం ట్రాక్టర్ నడుపుతూ వెళుతున్నాడు. ట్రాక్టర్ ఇంజిన్ ఆన్‌లో ఉండగానే కిందకు దిగుతుండగా అతని లుంగీ గేర్ రాడ్డుకు తగిలి ట్రాక్టర్ ముందుకు కదిలింది. అదే సమయంలో దుర్గాప్రసాద్ ట్రాక్టర్‌పై నుంచి దిగుతూ తూలి కింద పడిపోవడంతో ట్రాక్టర్ వెనుక చక్రం అతని పైనుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ హెచ్‌సీ సత్యారావు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. ఏలూరు రూరల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాణ్యమైన బోధనకు సమాయత్తం కావాలి

- సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాస్‌రావు
- పెదకాపవరంలో హెచ్‌ఎంలకు వర్క్‌షాప్


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న బి.శ్రీనివాస్‌రావు

ఆకివీడు: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన బోధన చేసేందుకు ప్రధానోపాధ్యాయులు సమాయత్తం కావాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. పెదకాపవరంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన భీమవరం డివిజన్ ప్రధానోపాధ్యాయుల వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో నాడు–నేడు పథకం ద్వారా పాఠశాలల్ని కార్పొరేట్ స్కూళ్లకన్నా మిన్నగా ప్రభుత్వం అభివృద్ధి చేసి విద్యార్థులకు కావాల్సిన వసతులు కల్పించారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా బోధన మెరుగుపరిచేందుకు అనేక శిక్షణా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి విద్యార్థిని సొంత బిడ్డగా ఉపాధ్యాయుడు భావించి ఉన్నత ప్రమాణాలతో చదివే విధంగా కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి ప్రభుత్వం రూ.లక్షా 5 వేలు ఏడాదికి ఖర్చుచేస్తోందని చెప్పారు. ఆ దిశగా విద్యా ప్రమాణాలు మెరుగుపడాలన్నారు. ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఫౌండేషన్ స్కూల్స్ ఏర్పాటు చేయనుందన్నారు. ఈ స్కూల్స్‌లో బోధన చేసేందుకు అంగన్‌వాడీ వర్కర్లకు, సెకండ్ గ్రేడ్ ఉపాధ్యాయులకు ఇప్పటికే ప్రత్యేక శిక్షణ ఇచ్చామని చెప్పారు. విద్యా ప్రమాణాలు మెరుగుపడితేనే ప్రభుత్వ పాఠశాలల మనుగడ ఉంటుందని, ఏ వసతులు లేని కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లపై తల్లిదండ్రులు ఎందుకు మక్కువ చూపుతున్నారో గుర్తించాలన్నారు. ఓఎస్‌డీ కఠారి వెంకట కృష్ణారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాలన్నారు. 3వ తరగతి నుంచి 8వ తరగతి వరకు పిల్లలకు మంచి విద్య అందిస్తే విద్యార్థి తన ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించగలడన్నారు. ఎంపీపీ కఠారి జయలక్ష్మి, డీఈఓ వెంకటరమణ, డీవైఈఓ శ్రీహరి, హెచ్‌ఎం కాళహస్తీశ్వరుడు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే



నన్నయ ప్రాంగణంలో ఫ్రెషర్స్‌డే వేడుకల దృశ్యం

తాడేపల్లిగూడెం: పట్టణంలోని ఆదికవి నన్నయ వర్సిటీ క్యాంపస్‌లో పీజీ విద్యార్థులు బుధవారం ఫ్రెషర్స్‌డే వేడుకలను నిర్వహించారు. విద్యార్థుల్లో ఆత్మీయత, స్నేహభావాన్ని పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని ప్రిన్సిపాల్ టి.అశోక్ అన్నారు. విద్యార్థులు సంగీతం, నృత్యం, వినోదాత్మక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కోర్సు కో–ఆర్డినేటర్లు , ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

40 రోజుల ఉపవాస దీక్షలు ప్రారంభం



రెవ. ఫీనెహాస్

పెంటపాడు: గ్రామ గ్రామాన బుధవారం క్రైస్తవ దేవాలయాల్లో దీక్షలు ప్రారంభమయ్యాయి. దీక్షాధారులు 40 రోజుల పాటు ఆధ్యాత్మిక చింతనతో నిరంతర ప్రార్థనలు చేయాలని సంఘ గురు మండల అధ్యక్షులు రెవ. ఫీనెహాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఫీనెహాస్ మాట్లాడుతూ 40 రోజుల పాటు ప్రతి ఏటా నిర్వహించే ఈ ఉపవాస ప్రార్థనలు విశ్వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతీ రోజు సాయంత్రం 7 గంటల నుంచి నిర్వహించబోయే ఈ సమావేశాలలో దేవుని ఆధ్యాత్మిక ప్రసంగాల ద్వారా దీవెనలు పొంది, విశ్వాసమును అభివృద్ధి చేసుకొని దేవుని కృపను పొందాలన్నారు. ముదునూరుపాడు బైబిలుమిషను చర్చిలో సంఘ ఉపాధ్యక్షుడు అద్దంకి దైవారావు, గూడెం సీతారాం పేట, వీకర్స్‌కాలనీ, సత్యవతి నగర్ ప్రాంతాలలోని చర్చిలలో రాజా ఎలీషా, మరనాత ఎలీషా, ఆనంద్ బెసలేల్‌ల ఆధ్వర్యంలో క్రీస్తు శ్రమల ప్రార్థనలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

శారదరాణికి అభినందనలు



అవార్డు అందుకుంటున్న శారద రాణి

తాడేపల్లిగూడెం (టీఓసీ): వరల్డ్ ఆర్యవైశ్య మహాసభ అపరాజిత ఉమెన్ ఆఫ్ నేషనల్ వామ్ అవార్డును తాడేపల్లిగూడెంనకు చెందిన ఆర్యవైశ్య మహిళా, మహాసభ వైస్ ప్రెసిడెంట్ పచ్చిపులుసు నాగ శారదరాణి చెన్నైలో నేషనల్ ఉమన్స్ కాన్ఫరెన్స్‌లో అందుకున్నారు. ఈ సందర్భంగా శారదరాణిని పలువురు ఆర్యవైశ్యులు అభినందించారు.

రేషన్ డీలర్ల సమస్యలను పరిష్కరించాలి



భీమవరంలో రేషన్ డీలర్స్ సమావేశంలో మాట్లాడుతున్న లీలామాధవరావు

భీమవరం: రేషన్ డీలర్స్ సమస్యలను పరిష్కరించాలని రాష్ట్రవ్యాప్తంగా భరోసా యాత్ర నిర్వహిస్తున్నట్లు రేషన్ డీలర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలామాధవరావు అన్నారు. బుధవారం భీమవరంలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాధవరావు మాట్లాడారు. రేషన్ డీలర్లకు గ్రామీణ ప్రాంతాల్లో రూ. 7,500, పట్టణాల్లో రూ. 10 వేలు గౌరవ వేతనంతో పాటు క్వింటాల్ బియ్యానికి రూ. 150 కమీషన్ ఇవ్వాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర కోశాధికారి రాజులపాటి గంగాధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాసిరెడ్డి నర్సింహరావు, జిల్లా గౌరవాధ్యక్షుడు అధికార సత్యనారాయణ, సూర్యచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

తేనెటీగల పెంపకం లాభదాయకం



తేనెటీగల పెంపకంపై మాట్లాడుతున్న కేవీకేప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లికార్జునరావు

ఉండి : తేనెటీగల పెంపకం లాభదాయకమని కేవీకే ప్రోగ్రామం అధికారి డాక్టర్ మల్లికార్జునరావు అన్నారు. బుధవారం స్థానిక కేవీకేలో తేనె టీగల పెంపకంపై ఏర్పాటుచేసిన శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తేనెటీగల పెంపకం వల్ల తేనెతో పాటు పలు ఉప ఉత్పత్తులకు గిరాకీ ఉందన్నారు. కీటక విభాగం శాస్త్రవేత్త రాజేష్ మాట్లాడుతూ తేనెటీగలలో రకాలు, ఉప ఉత్పత్తులు, పెంపకం వంటివాటిపై అవగాహన కల్పించారు. ఆసక్తి ఉన్న యువకులు, మహిళలు తదుపరి శిక్షణలో పాల్గొనవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్ డెబార మెస్సియానా, ఎ.శ్రీనివాసరావు, పి.వి నయలక్ష్మి, బి.రజిత పాల్గొన్నారు.

అందరికీ సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



ప్రభుత్వ ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంకును ప్రారంభిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



నూతనంగా ఏర్పాటు చేసిన లేబరేటరీలో పరికరాన్ని పరిశీలిస్తున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఉపముఖ్యమంత్రి మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్, బ్లడ్ బ్యాంక్, ఇంటిగ్రేటెడ్ పబ్లిక్ హెల్త్ లేబొరేటరీని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే పేద ప్రజలకు చిత్తశుద్ధితో వైద్యులు సేవలందించాలని తెలిపారు. వైద్య సేవల్లో ప్రథమస్థానం సాధించే విధంగా వైద్యులు కృషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యరంగాన్ని ఎంతో అభివృద్ధి చేసి ప్రజలకు వేగవంతమైన వైద్యసేవలను అందించేందుకు పటిష్ఠ చర్యలు చేసిందన్నారు. వైద్యఆరోగ్య శాఖలో అన్ని విభాగాల్లోను వైద్యులను, నర్సులను, సిబ్బందిని నియమించామన్నారు. వీటితోపాటు సాంకేతిక పరమైన అధునాతన వైద్య పరికరాలను ఏర్పాటు చేసిందన్నారు. వైద్యో నారాయణ హరి అన్నట్లు వైద్యులు కనిపించే దేవుళ్లగా ప్రజలు భావిస్తారని వారికి వైద్యసేవలందించాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ సూర్యనారయణ, సలహా సంఘ కమిటీ సభ్యులు కొలుకులూరి ధర్మరాజు, బోళం రామలక్ష్మి, జీఆర్ రెడ్డి పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో మేలు



13వార్డులో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): రాష్ట్రంలో అందరికీ ఆరోగ్యం అనే నినాదంతో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, వార్డు ఇంచార్జి తెన్నేటి జగ్జీవన్ అన్నారు. జగనన్న సురక్ష వైద్య శిబిరం బుధవారం స్థానిక 13వ వార్డులో నిర్వహించారు. వైద్యులు ప్రసాద్ బాబు, అశలత, శ్రావ్య, మనోహర్, ఉషారాణిలు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రజలందరి ఆరోగ్యమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇంటింటికి వెళ్లి వైద్యం అందించేలా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని కూడా ప్రవేశపెట్టారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్షలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన వారికి ప్రభుత్వమే ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తుందన్నారు. మున్సిపల్ ఏఎస్‌ఓ సురేష్‌బాబు, సచివాలయం కన్వీనర్ ధర్నాల శేఖర్, పులగం వెంకన్నబాబు, అడ్మిన్ సెక్రటరీ ఎస్.సూర్య, హెల్త్ సెక్రటరీ శారద, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రామికుల సంక్షేమమే జగన్ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: శ్రామికులకు సంక్షేమాన్ని అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. స్థానిక సిపాయిపేటలోని భవన నిర్మాణ కార్మికుల సంఘ భవనం నిర్మించి ఆర్చ్‌ని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాటను తుచా తప్పకుండా అమలు చేసింది ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఒక్కరే అని అన్నారు. తాడేపల్లిగూడెంలోని భవన నిర్మాణ కార్మికుల సంఘం నిర్వహించిన కార్యక్రమాలు తాను మొదటిసారి ఎమ్మెల్యేగా, రెండవ సారి ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖమంత్రిగా పాల్గొనడం జరిగిందన్నారు. గత 40 ఏళ్ల నుంచి ఐక్యమత్యంతో కార్మికులు సంఘం ముందుకు సాగుతుందన్నారు. తాడేపల్లిగూడెంకు ప్రత్యేక చరిత్ర ఉందన్నారు. ఇక్కడి రాజకీయ నాయకులు, పట్టణ పెద్దలు ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేశారన్నారు. గతం నుంచి వ్యాపార రంగంతోపాటు ఇప్పుడు విద్యారంగంలోను దేశంలోనే ప్రత్యేక స్థానం దక్కించుకుందన్నారు. మహానేత ఏర్పాటు చేసిన ఫీజు రియంబర్స్‌మెంట్ పథకాన్ని ఉపయోగించుకొని శ్రామికులందరూ తమపిల్లలకు ఉన్నత విద్యావంతులను చేయాలని అభిలషించారు. పట్టణంలోని ప్రజలు ప్రశాంత జీవితాన్ని గడిపేందుకు అన్ని సౌకర్యాలు కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయుసీ నాయకులు దూసనపూడి సోమసుందర్, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు, పట్టణ అధ్యక్షుడు పడాల శ్రీను, ఓవీ రాజు తదతరులు పాల్గొన్నారు.

కేశవస్వామి కల్యాణానికి ఏర్పాట్లు



తణుకులో సమావేశంలో మాట్లాడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ శ్రీవెంకట సుబ్బారావు

తణుకు అర్బన్: భీష్మ ఏకాదశి సందర్భంగా తణుకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కేశవస్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవానికి పూర్తి ఏర్పాట్లు చేసినట్లు ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు అన్నారు. తణుకు శ్రీకేశవస్వామి ఆలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గోస్తనీ కాలువ సమీపంలో నారద మహర్షి నిర్మించిన ఆలయంగా శ్రీకేశవస్వామి ఆలయం పురాణాల్లో నిక్షిప్తమై ఉందని, అటువంటి చరిత్ర కల దేవాలయ ఆవరణలో వివాహాలు చేసుకుంటే మంచిదనే నమ్మకంతో ముహూర్తాల సమయంలో అత్యధికంగా వివాహాలు జరుగుతాయని అన్నారు. ఆలయంలో ప్రతి ఏటా స్వామి, అమ్మవార్లకు తిరు కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే మహోత్సవాల్లో భాగంగా 18వ తేదీ రాత్రి 2.30 గంటలకు స్వామివారి కల్యాణం, 19న గ్రామోత్సవం, 20న ఉదయం 10.30 గంటల నుంచి అన్నసమారాధన, 24న రాత్రి 8 గంటలకు స్వామి వారికి పుష్పయాగోత్సవం కన్నుల పండువగా నిర్వహించనున్నట్లు వివరించారు. ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ మాట్లాడుతూ ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం రూ. 5 లక్షలు సొంత నిధులతో మరుగుదొడ్లు, బట్టలు మార్చుకునే గది, తదితర సౌకర్యాలు చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు నిర్మాణం చేయిస్తున్నట్లు చెప్పారు. ఆలయ అర్చకులు ఖండవల్లి హరికృష్ణ పర్యవేక్షణలో పూజాధికాలు నిర్వహిస్తారని వివరించారు. ఈ కార్యక్రమంలో పిల్లి సూరిబాబు, కుడుపూడి చంద్రరావు, ఆలయ ట్రస్టు బోర్డు మాజీ ధర్మకర్తల మండలి సభ్యులు, శెట్టిబలిజ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్



తణుకు మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వంక రవీంద్రనాథ్

తణుకు టౌన్: ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, ఇటువంటి సమయంలో గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ తెలిపారు. బుధవారం సాయంత్రం తణుకు మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఎంపీపీ రుద్ర ధనరాజు అధ్యక్షత వహించారు. ప్రతి మూడు నెలలకోసారి జరిగే మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి వివిధ మండల స్థాయి అధికారులు, మండలంలోని గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు విధిగా పాల్గొవాలని చెప్పారు. మండల పరిషత్ సర్వ సభ్య సమావేశాలకు అధికారుల పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు. గ్రామాల్లో మౌలిక వసతులైన తాగునీరు, విద్యుత్, డ్రెయినేజీ సమస్యల పరిష్కారానికి సభ్యులు ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువస్తారని, వాటి పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ మాట్లాడుతూ గ్రామాల్లో ఇంకా బాల్య వివాహాలను జరుగుతున్నట్లు తమకు సమాచారం వస్తుందని, అయితే గ్రామ స్థాయిలోని ప్రజాప్రతినిధులు బాల్య వివాహాలు జరగకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా వేల్పూరు ఎంపీటీసీ సభ్యురాలు చంద్రు శ్యామల మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో కాలపరిమితి ముగిసిన వస్తువులను ఇస్తున్నట్లుగా బాలింతలు, గర్భిణులు తమ దృష్టికి తీసుకొచ్చినట్లు తెలిపారు. వేల్పూరు ప్రాథమిక కేంద్రం వైద్యాధికారిని భవానీ మాట్లాడుతూ తణుకు మండలంలోని మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా 9877 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ముళ్లపూడి అన్నపూర్ణదేవి, వైస్ ఎంపీపీ ఐ శేషుకుమారి, మండల ప్రత్యేక అధికారి పీ శ్రీనివాసరావు, ఎంపీడీవో డీ శ్రీలలిత, ఎంపీటీసీ సభ్యులు, వివిద గ్రామాల సర్పంచ్ అడ్డా బాబు, పాలా శ్రీను, వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా గణపతి విగ్రహ పునః ప్రతిష్ఠాపన మహోత్సవం



గణపతి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలలో పాల్గొన్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

అత్తిలి: మండలంలోని ఉరదాళ్లపాలెం గ్రామంలో శ్రీవినాయక స్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవానికి బుధవారం రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు హాజరయ్యారు. విగ్రహ ప్రతిష్ఠాపన పూజలలో మంత్రి కారుమూరి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. గణపతి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా మంత్రి కారుమూరి నాగేశ్వరరావుని ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, సర్పంచ్ శింగంశెట్టి శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు గుండుమోగుల శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు రంభ సూరిబాబు, మద్దాల శ్రీనివాస్, కంకటాల సతీష్, వినుకొండ వీరన్నకాపు, షేక్ పకీర్‌సాహెబ్, దాసిరెడ్డి భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

ఎండు గడ్డి లారీలో అగ్నిప్రమాదం



కాల్వలోకి దూసుకెళ్లిన ఎండుగడ్డి తరలిస్తున్న లారీ

తణుకు: ఎండు గడ్డి తరలిస్తున్న లారీలో అగ్నిప్రమాదం జరగడంతో అదుపుతప్పి సమీపంలో కాల్వలోకి దూసుకెళ్లిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. తణుకు మండలం మండపాక గ్రామంలో ఈ సంఘటన జరిగింది. ఏలూరు జిల్లా మండవల్లి గ్రామానికి చెందిన గణేష్ లారీలో ఎండు గడ్డి లోడు చేసుకుని మండపాకలోని ఫ్యాక్టరీకు తరలిస్తున్నారు. మార్గ మధ్యలో మండపాకవద్ద రోడ్డుప్రక్కన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టింది. దీంతో లారీలో ఎండుగడ్డికి మంటలు వ్యాపించాయి. ఈ సమయంలో డ్రైవర్ అప్రమత్తమై వెంటనే అత్తిలి కాలువలోకి లారీని మళ్లించాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు అగ్నిమాపక కార్యాలయానికి ఫోన్ చేయడంతో వాహనంతో సిబ్బంది వెంటనే వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో సుమారు రూ. లక్ష నష్టం వాటిల్లిందని అగ్నిమాపక అధికారి అజయకుమార్ తెలిపారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

తణుకు టౌన్: ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీఎన్‌జీవో తణుకు తాలూకా అధ్యక్షుడు, ఉద్యోగ, కార్మిక, పెన్షనర్స్ జేఏసీ చైర్మన్ కేఎస్‌వీ నరసరాజు కోరారు. బుధవారం రాష్ట్ర ఉద్యోగ, కార్మిక, పెన్షనర్స్ జేఏసీ ఇచ్చిన పిలుపులో భాగంగా మధ్యాహ్నం తణుకు తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు 12వ పీఆర్‌సీలోని 30శాతం ఫిట్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. జేఏసీ కన్వీనర్, ఎన్‌జీవో అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ వివిధ ప్రభుత్వ శాఖలలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది వెంటనే రెగ్యులర్ చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి రవి కుమార్, ఏపీటీఎఫ్ నాయకులు ఐ రాజ్‌గోపాల్, ఎస్‌టీయూ నాయకులు భాణు ప్రసాద్, పెన్షనర్ల అసోసియేషన్ నాయకులు కాయల నాగేశ్వరరావు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగే లక్ష్యం



ప్రధానోపాధ్యాయుల వర్కుషాపులో మాట్లాడుతున్న ఎస్ఎస్ఏ పీడీ శ్రీనివాస్‌రావు

ఆకివీడు: విద్యా ప్రమాణాల మెరుగే లక్ష్యంగా ప్రధానోపాధ్యాయులు పనిచేయాలని సర్వ శిక్షా అభియాన్ ప్రాజెక్టు రాష్ట్ర డైరెక్టర్ బి.శ్రీనివాస్‌రావు అన్నారు. భీమవరం డివిజన్‌లోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు బుధవారం ఆకివీడు మండలం పెదకాపవరం గ్రామంలో వర్కుషాపు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్లో పెనుమార్పులు వచ్చాయని, విద్యా వ్యవస్థకు అవసరమైన వసతులు కలిస్తున్నారని చెప్పారు. యాప్‌ల ద్వారా, ఇతర నివేదికల ద్వారా ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలపై పని ఒత్తిడి పెరిగిందనడం సరికాదని, గత ప్రభుత్వ హయాం నుంచే యాప్‌లు వచ్చాయని వివరించారు. బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ పిల్లలకు మంచి విద్యను అందించాలన్నారు. విద్యార్థులను ఉన్నత స్థితిలోకి తీసుకెళ్లే విధంగా విద్యా బోధన ఉండాలని సూచించారు. ప్రభుత్వ ఓఎస్‌డీ కఠారి వెంకట కృష్ణారావు మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తూ, విద్యార్థుల సంఖ్య పెరిగేందుకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, ఇందుకు అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ కఠారి జయలక్ష్మి, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

20న బహిరంగ వేలం

నరసాపురం: పట్టణంలోని మండ సత్యనారాయణ మూర్తి, ఫిష్ మార్కెట్ మున్సిపల్ కాంప్లెక్స్‌ల్లో ఖాళీగా ఉన్న 20 షాపులకు లీజుకిచ్చే నిమిత్తం బుధవారం బహిరంగ వేలం నిర్వహించారు. హెచ్చు పాటదారులకు మూడు సంవత్సరాల కాల పరిమితితో షాపులు అప్పగించారు. మరో 20 షాపులకు ఈ నెల 16న బహిరంగ వేలం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ తెలిపారు.

రాజ్యసభ సభ్యుల ఎంపికపై హర్షం

తణుకు టౌన్: బడుగు, బలహీన వర్గాలు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన నాయకులను రాజ్యసభ ఎంపీ స్థానాలకు ఎంపిక చేయడం చారిత్రాత్మక నిర్ణయమని మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనందం కుమార్ చెప్పారు. దళిత వర్గానికి చెందిన పాయకరావు పేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావును ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభ ఎంపీగా ఎంపిక చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. గతంలో కూడా వెనుకబడిన వర్గాల వారికి రాజ్యసభ పదవులను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కట్టబెట్టారని చెప్పారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అన్ని కులాల సమగ్ర అభివృద్ధిని కాంక్షిస్తూ రాజకీయ, సామాజిక రంగాల్లో విప్లవాత్మకమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావు పూలే ఆశయాలకు అనుగుణంగా రాజకీయ పదవులకు ఎంపిక చేస్తున్నారన్నారు.

జవానుల త్యాగం మరువలేనిది

తాడేపల్లిగూడెం రూరల్: పుల్వామా దాడిలో అసువులు బాసిన జవానుల త్యాగం ఎప్పటికీ మరువలేనిదంటూ అమర జవానులకు బుధవారం బ్యాంకు ఆఫ్ ఇండియా సిబ్బంది నివాళులర్పించారు. త్యాగధనులకు అండగా నిలవాలంటూ పిలుపునిచ్చారు.

వైభవంగా శ్రీ పంచమి పూజలు



తాడేపల్లిగూడెం రూరల్: చిన్నారులతో సరస్వతీ పూజలు జరిపిస్తున్న తల్లిదండ్రులు



అత్తిలి: బల్లిపాడు స్కూల్‌లో చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న దృశ్యం



తాడేపల్లిగూడెం(టీఓసీ): సరస్వతి మాత విగ్రహ ఆవిష్కరణలో గ్రంధి సత్యనారాయణ దంపతులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని వీరంపాలెం శ్రీబాలాత్రిపుర సుందరి ఆధ్యాత్మిక పీఠంలో బుధవారం వసంత పంచమి సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసాలు కార్యక్రమం నిర్వహించారు. పీఠం ప్రతినిధి ఈమని శశికుమార్, అర్చకులు లలిత్‌కుమార్ పర్యవేక్షణలో విఘ్నేశ్వర పూజ, సరస్వతి పూజలను జరిపించారు. జిల్లాతో పాటు పొరుగు జిల్లాలు, రాష్ట్రాల నుంచి సుమారు వెయ్యిమందికి పైగా చిన్నారులతో దఫ దఫాలుగా అక్షరాభ్యాసాలు నిర్వహించినట్లు శశికుమార్ తెలిపారు. తెల్లవారు జాము నుంచి అక్షరాభ్యాసాలు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వివరించారు. చిన్నారులు, వారి తల్లిదండ్రులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసి కనిపించింది. అనంతరంవచ్చిన భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాదవితరణ చేశారు.

అత్తిలి: శ్రీపంచమి సందర్భంగా బల్లిపాడు శ్రీమదనగోపాల్ స్కూల్‌లో అక్షరాభ్యాస మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. చిన్నారులతో సామూహికంగా అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతి దేవికి ప్రత్యేక పూజలు చేశారు. స్కూల్ ప్రిన్సిపాల్ తిరుపతి శ్రీనివాస్, ఇన్‌చార్జ్ ఆకుల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు బాడిగ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా సరస్వతి మాత విగ్రహ ఆవిష్కరణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక డీఆర్ గోయంకా విద్యా సంస్థల్లో బుధవారం వసంత పంచమి సందర్భంగా సరస్వతి మాత విగ్రహన్ని ఆవిష్కరించారు. హోమం, చిన్నారులచే సామూహిక అక్షరాభ్యాసాలు చేశారు. వాసవి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ గ్రంధి సత్యనారాయణ దంపతులు ప్రత్యేక పూజలు జరిపారు. ఆయన మాట్లాడుతూ చదువుల మాత సరస్వతి దేవి ఆశీస్సులు విద్యార్థులకు ఉండాలన్నారు. కార్యక్రమంలో లాల్ బహదూర్ శాస్త్రి ట్రస్ట్ వారిచే పలక, బలపాలు పిల్లలకు అందజేశారు. విద్యా సంస్థల ఉపాధ్యక్షుడు మంతెన రామచంద్రరాజు, కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ఎస్ గణపతి రామ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.